# అభినందన

మన పరిచయస్తులెవరైనా... మనం సాధించని విజయమేదో సాధించారని తెలిసినపుడు....

"కంగ్రాచ్యులేషన్స్" తెలుపడం మనం పెద్ద మనసుకి అద్దం పడ్తే....

"ఆఁ ఏ అడ్డదార్లు తొక్కి సాధించి ఉంటాడో... లేకపోతే వాడి ముఖం... వాడు సాధించడమేమిటీ ?" అని దీర్ఘాలు తీయడం.... మన ఈర్ష్యాద్వేషాల్నీ, సంకుచిత మనస్తత్వాన్నీ, లేకిబుద్ధినీ సూచిస్తుంది !

నిజానికి ఒక వ్యక్తిని చూసి ఈర్ష్య పడటం కన్నా సిగ్గు పడవలసిన విషయం మరోటి ఉండదు !

**ఒకర్ని చూసి మనం ఈర్ష్య పడ్తున్నామూ అంటే.... మనకి తెలీకుండానే మనం ఆ వ్యక్తికన్నా అధములమని అంగీకరిస్తున్నామని అర్థం!**

పోతే...

పోటీ మనస్తత్వమున్న వాడు... పక్కవాణ్ణి చూసి ఈర్ష్య పడకుండా.... అతడి కన్నా తన స్థాయి పెంచుకోవడానికి ప్రయత్నిస్తాడే తప్ప..... ఆ వ్యక్తిమీద అవాకులూ.... చవాకులూ... పేలి.... తన కుళ్ళుబోతు బుద్ధిని ప్రదర్శించుకోడు !

అభినందన అనేది సున్నితంగా... సూటిగా.. సరళంగా... హృద్యంగా... నాల్గయిదు వాక్యాల్లో కేవలం ఆ వ్యక్తికి మాత్రమే తెలిసేలా చెప్పడం ఒక రకమైతే... సభలూ.... సమావేశాలూ ఏర్పరచి... నిలువెత్తు పూలదండల్తో నల్గురికీ తెలిసేలా పొగడ్తల వర్షం కురిపించడం మరో రకం!

మొదటి రకం - ఆ వ్యక్తి అంతరంగాన్ని సుతిమెత్తగా స్పృశించి... అతడికి మానసికోల్లాసం కలిగిస్తే...

రెండోరకం - ప్రచారం ఏ మాత్రం ఇష్టం లేని వ్యక్తికి - ఇదీ అని చెప్పలేని 'ఇబ్బంది'ని కల్గిస్తుంది!

ఏదేమైనా...

ఒక వ్యక్తిలోని 'స్పార్క్'ని అతడు ఏ పదవిలోనూ లేనపుడు గుర్తించి.... అతడికి సన్మానాలూ, సత్కారాలూ, అభినందన సభలూ నిర్వహించడం... నిర్వాహకుల నిస్వార్థాన్నీ, ఉదాత్తతనీ, చిత్తశుద్ధినీ, విశాల హృదయాన్నీ ప్రతిబింబిస్తే....

ఆ వ్యక్తికో పదవి లభించాక... ఆ వ్యక్తి నుండి దేన్నో ఆశించి... 'అభినందన సభ'లు నిర్వహించడం... 'మస్కా' అన్పించుకుంటుంది!

పోతే...

ఇతరుల పట్ల ఈర్ష్యాళువులమై...

వాళ్ళని 'పాతాళాని'కి లాగడానికి ప్రయత్నించకుండా...

భట్రాజు పొగడ్తలతో 'ఆకాశాని'కెత్తేయకుండా....

ఒక్క చూపుతోనో,

చిన్న మాటతోనో,

చిరునవ్వుతోనో...

మన అభినందన తెలియచేస్తే.... దాన్ని స్వీకరించిన వ్యక్తి రెట్టించిన ఉత్సాహంతో.. మరో అద్భుతాన్ని సాధించడానికి ఉద్యుక్తుడవుతాడు!

16-06-1995